
తెనాలి సుశీలాదేవి



# ఆకర్షణలో అపస్వరాలు

"జీవన్! నాకు భయంగా వుంది."

చప్పున మెలకువ వచ్చి కళ్లు తెరవబోయిన మైథిలి యీ మాటలు విని కదలకుండా అలాగే వుండిపోయింది.

అది బొంబే-మద్రాసు మెయిలు ఫస్టు క్లాసులో కూపేలో....

"పిచ్చి రాజీ! భయమెందుకూ? నేనున్నానుగా...."

"అదికాదు జీవన్, మనం పొరపాటు చేస్తున్నామేమోనని...."

"చూడు రాజీ! మదిలే ప్రతి చిన్న ఆలోచనకి, వేసే ప్రతి అడుక్కీ ఇలా సందిగ్ధపడుతూ పోతే జీవితంలో మనం పొందాల్సినవి ఎన్నో పోగొట్టుకుంటాం. ధైర్యంగా ముందడుగు వేయాలి...."

"ఆయన రేపు క్యాంపునుండి...."

"వస్తాడు. నీ ఉత్తరం చూస్తాడు. కాసేపు తల బాదుకుంటాడు. అయినా ఆ అయోమయంగాడికి నీ వెందుకు వెళ్లిపోయావో కూడా అర్థమయిచావదు.

"జీవన్...."

"ఇదిగో రాజీ! యిక ఆయన గురించి ఆలోచనలు తుడిచిపెట్టేయి. మూర్ఖుడికి మొగిలిపువ్వు ఇస్తే ఏదో చేశాట్ట. నీ సౌందర్యం. నీ సొగసు, నీ హొయలు, యిన్నాళ్లూ ఆ మూర్ఖుడిచేతుల్లో పెట్టి పాడుచేసుకున్నావు. రాజీ! వాడి పాలపడకముందే నీవు నాకు తటస్థపడివుంటే నీ అందం పిచ్చెక్కిస్తుందనీ, నీ సొగసు మైకం కమ్మిస్తుందనీ, నీ హొయలులో స్వర్గద్వారాలు వున్నాయని నిన్ను చూసిన రోజే అన్పించింది. నాలాంటి ఆరాధకుడు, రసికుడు, ప్రేమమూర్తి నీకు లభించి వుంటే నీ అందం విరగబూసి, నీ యౌవనం పరవశించి...."

"జీవన్! వూరుకో. ఎవరయినా వింటారు."

"ఆ....అందరూ నిద్రలో ఉన్నారు. రాజీ...."

మైకంగా, మత్తుగా పిలిచిన ఆ పిలుపుకి - కొన్ని క్షణాల నిశ్శబ్దానికి - మైథిలి కొద్దిగా దుప్పటి కళ్లమీంచి జార్చి ఓరగా ఎదుట సీటుకేసి చూసి చప్పున కళ్లుమూసుకుంది.

అతను....ఆ జీవన్ రాజీని.... చేతులతో చుట్టేసి...ముఖంమీదకి వంగి...

"నేను వెడతాను."

"జీవన్ నీవూ నాతోపాటు యిక్కడే కూర్చుని వుంటే...."

"వద్దు రాజీ! ఈ లైన్‌లో నాకు చాలా మంది తెలిసినవాళ్లు తారసపడతారు. తెలిసిన టి.సి.లు ఎవరయినా చూశారంటే ....అయినా ఇక్కడ నీకేం భయంలేదు. హాయిగా నిద్రపో....తీయని కలలు కను. ఆ కలల్లో కనిపించే రంగులజీవితం నీ కళ్లముందు నిజంచేసి నీవు నాకిచ్చే ఆనందానికి, అనుభవానికి, తృప్తికి ఋణం తీర్చుకుంటాను. గానుగెద్దులాంటి నీ భర్తదగ్గర యిన్నాళ్లుగా నీవెంత ఆనందాన్ని, సుఖాన్ని కోల్పోయావో నీకు రేపట్నుంచే తెలుస్తుంది. రాజీ! డార్లింగ్! రేపటినుంచీ ప్రతిక్షణం నువ్వే నేను, నేనే నీవు. చూస్తావుగా. ట్రెయిను కదులుతుంది. నేను స్లీపర్ కోచ్‌లో వుంటాను. హాయిగా నిద్రపో. ఉషోదయంతోనే సెంట్రల్‌లో మహారాణీవారిని దర్శించుకుని రిసీవ్ చేసుకుంటాడు యీ భక్తుడు. సరేనా...."

ఋగ్గమైన చిటికె వేసి చరచరా వెళ్లిపోతున్న జీవన్‌కేసి అలాగే చూస్తూండిపోయింది రాజేశ్వరి.

ట్రెయిన్ కదిలింది.

"క్షమించండి. ఏ స్టేషన్ యిది?"

వులిక్కిపడి, తిరిగి చూసింది

రాజేశ్వరి. మైథిలి కొద్దిగా రగ్గు తొలగించి చూసింది.

"కడప," భయంగా, ముక్తసరిగా అంది రాజేశ్వరి.

"మీ రీ స్టేషన్‌లోనే ఎక్కారా?"

"అవును."

"ఎక్కడిదాకా?" అంటూ లేచి మోకాళ్ల గుండెలకు ఆనించుకుని కూర్చుంది మైథిలి.

"మెడ్రాస్," చెమటలు పోస్తున్నాయి రాజేశ్వరికి.

"పడుకోండి, కూర్చునే వున్నారేం."

"అహ....నిద్రరావటం లేదు."

"నిజం. నిద్ర ఒక వరం లాంటిదే. అనుకున్నప్పుడంతా నిద్రపోగలగటం ఒక వరమే కాదూ."

రాజేశ్వరికి కాస్త బెరుకు తీరింది. అయినా తనైతే తాను ఏం మాట్లాట్టానికి భయం, ఏమేం ఆరాలు బయటికి వస్తాయోనని.

మీదికి చూసింది మైథిలి. పైబర్తు మీద పడుకున్న అతను కదిలినట్లయింది.

"పైన ఉన్నది మీవాళ్లేనా?" రాజేశ్వరి అడిగింది.

"అ....కాదు...ఎవరో ప్యాసింజరు."

పైబర్తుమీద కదిలిన అతను సర్దుకుని అలాగే పడుకున్నాడు.

"అయితే మీరు ఒంటరిగా...."

"మీకు తోడున్నారా?" చప్పున అంది మైథిలి.

"అ....అ....వున్నారు....మా....మా వారే....తన ఫ్రెండ్స్ పక్క పెట్టెలో వున్నారని...." తడబడింది రాజేశ్వరి.

"అదృష్టవంతులు."

"అదే ....మీరు...."

"అ అదృష్టాన్ని పోగొట్టుకుని.... కాదు కాదు....కాలదన్నుకుని, రత్నమేదో తెలుసుకోలేని గుడ్డిదాన్నయిపోయి, నా అనే వాళ్లందరినీ వదులుకుని....ఓహ్ నేనేదో మాట్లాడేస్తున్నాను, క్షమించండి. కదిలిస్తే చాలు కడలిలోని తరంగాల్లా పొంగుతుంది నా హృదయంలో ఆవేదన. ఎందుకో మిమ్మల్ని చూడగానే....నాకు నాకు....మా చెల్లెలు గుర్తుకొచ్చి...." మోకాళ్లమీదికి తలవాల్చేసి ఏడ్చేసింది మైథిలి.

"ఆవిడ కేమయింది?"

"తనకేం కాలేదు. నేనే .... నేనే చేశాను .... నా సుఖంకోసం .... వెనకా ముందు ఆలోచించకుండా...."

"ఏమైంది?" రాజేశ్వరి గొంతులో అదుర్దా....కుతూహలం.

"మీకు నిద్రరాకపోతే చెబుతాను, వింటారా? అప్పుడప్పుడూ ఎవరయినా ఇలా దగ్గరగా, ఆత్మీయతగా అనిపించి అడిగినప్పుడు యీ హృదయభారం తీర్చేసుకోకపోతే నా గుండెల్లో రగిలే దావాగ్ని నన్ను కాల్చేస్తుంది. ఇలా ఎవరికయినా ఏకాంతంలో నా ఆవేదనలు బయటపెట్టుకుని కాసేపు కన్నీళ్లు కార్చేస్తే తప్ప ఆ మంట చల్లారదు. నా గుండెల్లో అగ్నిపర్వతం వుందని, అది సెగలూ, పొగలూ చిమ్ముతూ వుంటుందని నాకు మాత్రమే తెలుసు. నే నొక అభాగ్యురాలిని. నా దొక నికృష్టపు బ్రతుకు..." మోకాళ్లలోంచి తల బైటకు తీసిన మైథిలి కళ్లు మంకెనపువ్వుల్లా వున్నాయి. పెదిమలు బిగబట్టుకుని దుఃఖాన్ని కంఠంలోనే ఆపుచేస్తోంది.

"నాకు నిద్ర రావటం లేదు. మీరే మనుకోకపోతే చెప్పండి, వింటాను."

మీదనున్న బర్తుకేసి ఓసారి చూసింది మైథిలి. అక్కడేం కదలిక లేదు.

"నాపేరు మైథిలి," అంది.

"నాపేరు రాజేశ్వరి," చప్పున నాలుక కర్చుకు రాజేశ్వరి. ఆవిడ అడగలేదుగా.

* * *

"నాపేరు మైథిలి. అంటే సీతాదేవి పేరు కదూ. ఆవిడ పేరు పెట్టుకున్న నేను ఆ పేరుకే చాలా అపచారం చేశాను. నా చిన్నతనంలోనే తల్లి పోయింది. నేను, చెల్లి. మా యిద్దర్ని రెండు కళ్లుగా పెంచారు మా నాన్న. పెంకుటింటిలో నేలమీద పడుకున్నా, ఊహాలోకంలో ఇంద్రధనస్సు పల్లకీ ఎక్కి వూరేగుతూండేదాన్ని. ఎప్పుడు భావనాప్రపంచంలో విహరించే నాకు వర్తమానం, వాస్తవం చేదుగా కనిపించేవి. అనిపించేవి.

నాన్న నాకు పెళ్లి చేశారు. చెల్లి నా కంటే నాలుగేళ్లు చిన్నది. నాన్నకు వండి పెడుతూ కుట్లు, అల్లికలూ నేర్చుకొనేది.

భర్తవెంట వచ్చిన నాకు సకల సౌకర్యాలు సమకూరుతా యనుకున్నాను. కాని మాలాంటి మామూలు సంసారం, ఉద్యోగరీత్యా ఆయన, నేను మాత్రమే ఒంటికాపురం.

ఇంట్లో చేరి సామాన్లయినా సర్దుకోక మునుపే ఆఫీసుకి బయలుదేరిన ఆయన్ని చూసి ఆశ్చర్యపోయాను. నిరుత్సాహపడ్డాను. నా వూహల పల్లకీ నుంచి ఒక్కసారిగా జారి కిందపడిపోయినట్టు అయింది నా పని. సినిమాలో లాగ ఆఫీసుకు వెళ్లకుండా మారాం చేస్తారని, కొంగు వదలరని....యిలా....యిలా.... ఆ తరువాత అన్నీ నా వూహలకు భిన్నంగా....

సినిమాల్లో, నవలల్లోని హీరోల్లో కనిపించే చురుకుదనం, చిలిపితనం, ప్రేమ, ఆరాధన యివన్నీ నా భర్తలో చూసుకోవాలనుకున్న నాకు తీవ్రమైన ఆశాభంగం కలిగింది.

నేను కోరుకున్నవేవీ నా అనుభవంలోకి రాకపోవడంతో నేను బాగా దగాపడ్డానని, విధి నన్ను వంచించిందనీ ఎంత గానో మథనపడేదాన్ని. రాఘవ నాకు ఏలోటూ చేయకపోయినా నా ఊహల పరిధికి అతను చేరకపోవడంతో నాలో అసంతృప్తి పెరిగిపోయింది.

ఉదయాన్నే ఆఫీసుకి బయలుదేరి వెడితే రాత్రికిగానీ యిల్లు చేరని రాఘవ

నా అసంతృప్తిని గుర్తించలేకపోయాడు. గుర్తించినా అంతకు మించి నన్ను సంతోషపెట్టటానికి అతనికి వీలుపడదు. అతను నాకు తాళికట్టినా ఆ ఉద్యోగం అతనికి కట్టిన తాళి చాలా బలమయింది.

నా అందచందాలుగానీ, నా పనిపాటల నేర్పుగానీ అతని దృష్టికి ఆనకపోవడంతో రాఘవంటే నా కొక విధమైన చులకన భావం, నిర్లక్ష్యం ఏర్పడటంతో అతని పాలిటబడి నా జీవితం వ్యర్థమైపోయిందని కుమిలిపోయేదాన్ని.

సరిగ్గా యిలాంటి పరిస్థితులలోనే కారుచీకటిలో సౌదామినిలా 'గిరి' నా జీవితంలో ప్రవేశించాడు. మొదటిసారిగా అతన్ని చూసినప్పుడు, సరిగ్గా నాకు కావలసినటువంటి, నేను కోరుకుంటున్నలాంటి మగవాడు యితనేనా? అనిపించింది. మా యింటి ప్రక్కనే వున్న గది అద్దెకుతీసుకుని ఎప్పుడయితే ఆ గదిలో అతను ప్రవేశించాడో నా మనసులోనూ అతడి ప్రవేశం జరిగిందని తెలిసిపోయింది. ఒంటరివాడు.... బ్రహ్మచారి. రాఘవతో క్షణాలమీద పరిచయం చేసుకుని అతని ద్వారా నా పరిచయమూ సంపాదించాడు.

ఆ తరువాత రాఘవ ప్రమేయం లేకుండా మా యిద్దరిమధ్య స్నేహమో ఆకర్షణో ఏదైతేనేం నేనే ముందడుగు వేశానో, తనే ముందుకు వచ్చాడో తెలీదుగానీ నేను కోరుకున్న లక్షణాలన్నీ మూర్తీభవించినట్లున్న గిరికి మానసికంగా చాలా దగ్గరికి వచ్చేశాను.

ప్రతిక్షణం అతన్ని చూస్తూనే ఉండాలనిపించేది. గలగల పారే సెలయేరులా అతను నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడేస్తుంటే గంటల తరబడి అలా వింటూ వుండిపోయేదాన్ని. అతనిముందు రాఘవ మరీ బ్రభాజమానంలా కనిపించసాగేడు నాకు.

ఓరోజు....

రాఘవ ఆఫీసు కెళ్లిపోయాక వంటయింట్లో ఏదో వండుతూ చప్పున తల తిప్పి గుమ్మంకేసి చూశాను. వంటింటి గుమ్మం రెండుచేతుల్తో పట్టుకుని తదేకంగా చూస్తున్నాడు గిరి. నేను వెనక్కి తిరిగి చూడటంతో నవ్వుకున్నాడు. అతను రాఘవ లేకపోయినా అప్పుడప్పుడు వచ్చి కబుర్లుచెప్పటం అలవాటే అయినా అతను నిశ్శబ్దంగా యింతసేపూ నా వెనుకనుంచి గుచ్చి గుచ్చి చూసినచూపు నా ఒళ్లంతా తడిమినట్టయి ఏదో గిలిగింతలు పెట్టినట్టయింది.

"మిమ్మల్ని చూస్తుంటే ఆ భగవంతుణ్ణి బాగా తిట్టాలనిపిస్తోంది," అన్నాడు.

"ఎందుకని?" నవ్వుతూ అన్నాను.

"ఏ పెద్ద ఆఫీసరుగారి అర్ధాంగో అయివుండాల్సిన లక్షణాలు మీవి. మీ అందం, తీవి, సొగసు, ఆ హొయలు యిలా గుమస్తా మొగుడి చేతుల్లోనూ.... ఈ అంట్లగిన్నెల మధ్య మరుగున పడిపోయి, మాసిపోయి....ప్చ్....ప్చ్"

"అయితే ఏమిటంటారూ?" నాలో ఆత్రుత యింకా ఏదో వినాలని.

"తలంటు పోసుకున్న ఆ జుట్టు, ఆ ఎర్రచీర, ఎర్రబ్లవుజు, ఎర్రనికుంకుమ, అబ్బ ముద్దమందారంలా వున్నారండీ.... ఐయాం సారీ....యిలా అంటున్నానని కోపం తెచ్చుకోకండి. మనసులో భావనని దాచుకోలేక...."

"కోపమా?....నే నెంతగా పరవశించి పోతున్నానో, అలాంటి మాటలకోసం ఎంతగా తపించుకుపోతున్నానో అతనికేం తెలుసు. ఒక్కనాడు....ఒక్కనాడయినా రాఘవ తన అందం గురించి ....ఉహూ అతనికి ఇంట్లో పనిచేయటానికి రాత్రిళ్లు పక్కచేరటానికి ఆడదయితే చాలు. అందగత్తె కానక్కర లేదు. అలాంటివాడికి తను భార్యకావటం అతని దృష్టికి అదృష్టమో కాదో గానీ తను మాత్రం చాల దురదృష్టవంతురాలు.

"మీలాంటి అమ్మాయి నాకే గనుక కనపడివుంటే...."

"ఏంచేసేవారు?" అన్నాను. ఏదో ఉత్సాహం నాలో.

"ఎవరు ఒప్పినా ఒప్పకపోయినా ఎగరేసుకుపోయేవాడిని.

నా గుండెల్లో అలజడి.

"యిప్పుడు ఎగరేసుకుపోతే సరి," అప్రయత్నంగా అన్నాను. కాని అనకూడని మాటేదో అనేసినట్టు, నా మనసు బయటపెట్టేసినట్టు,...ఏదో సిగ్గు....అతని ముఖంలోకి చూడలేకపోయాను.

అందాల దేవత కరుణించి, వరించి వస్తానంటే వద్దనే మూర్ఖుడుంటాడా.... 'పడిసస్తాను వస్తనంటే కాళ్లకాడ' అంటూ రాగం తీశాడు సన్నగా.

నవ్వొచ్చింది....సిగ్గొచ్చింది .... నా శరీరమంతా తీయని అనుభూతికి లోనయింది. ఎన్నాళ్లకి నా శరీరం, గుండె పులకరిస్తున్నాయి అనిపించింది.

ఒకరిపట్ల ఒకరికి గల తీవ్రమయిన కాంక్ష బయటపడటంతో ఆ పంజరంలో నేను వుండలేననిపించింది. విశాల విశ్వంలో రంగుల హరివిల్లు లాంటి జీవితం నాకు చూపెడతానని, గిరి నన్ను పూరించాడు. రాఘవతో నేను కలిసివుండలేనని, భయం భయంగా తనకు దగ్గర కాజాలనని, నన్ను ఎక్కడికయినా దూరంగా తీసుకుపోతే తప్ప నేను అతడిని సంతోషపెట్టలేనని చెప్పడంతో రాఘవనుండి దూరంగా నన్ను తీసుకుపోయాడు గిరి.

మైథిలి కొన్ని క్షణాలు ఆగింది. బరువుగా ఊపిరి తీసుకుంది. రాజేశ్వరి కుతూహలంగా వింటోంది. ఆ కొన్ని క్షణాల విరామం భరించలేనట్టు అనిపించింది.

"ఆ తరువాత...."

తదేకంగా రాజేశ్వరి కళ్ళలోకి చూసి మొదలుపెట్టింది మైథిలి.

"ఆ తరువాత...ఏముంది. మామూలు కథే. పంజరంలోంచి బయటపడిన నాకు ప్రపంచమంతా సుందర నందనోద్యాన వనంలా కనిపించింది గిరి సాన్నిహిత్యంతో. యిన్నాళ్ల నా జీవితం, నా అందం, యౌవనం వ్యర్థమయినట్లుగా బాధపడ్డాను. ఇద్దరం పక్షుల్లా స్వేచ్ఛగా బాదరబందీలు లేకుండా ప్రేమమయి జగత్తులో విహరించి....

ఒకనాడు ఓ హోటల్ గదిలో....

"మైథిలీ! నీవు రాఘవ దగ్గరికి వెళ్లిపో" అన్నాడు.

వెర్రిదానిలా చూశాను.

"ఔను. నాకు మా నాన్న ఉత్తరం వ్రాశాడు. పిల్లను చూసుకోడానికి రమ్మని."

"ఎందుకు?" అయోమయం.

"ఎందుకేమిటి నీ మొహం. పిల్లను ఎందుకు చూస్తారు, పెళ్లి చేసుకోటానికి," నవ్వుతూ అన్నాడు.

"గిరీ!.... పెళ్లా .... నీకు....మరి.... నేను...." ఏం అడగాలో, ఏం మాట్లాడాలో తోచని స్థితి. కరిగిపోతున్న తీయని స్వప్నం తాలూకు బాధ.

"అవును మైథిలీ! అందుకే నిన్ను రాఘవ దగ్గరికి వెళ్లిపొమ్మంటున్నాను. నీవు కలల్లో ఊహించుకుని, కావాలని కోరుకున్న జీవితం నీకు అందించాను. ఈ అనుభవాల తాలూకు అనుభూతితో నీ జీవితమంతా గడిపేయవచ్చు."

"గిరీ! నీవు నన్ను పెళ్లి చేసుకుంటానని,జీవితాంతం నీతో గడపనిస్తావని...."

"పూర్ మైథీ! నీవు నాకన్నా ఒకటో, రెండో ఏళ్లు పెద్దదానివే వుంటావు. అయినా యింకోడి భార్యవి. నిన్ను చేసుకోటానికి నాకు అమ్మాయిలే దొరకరా?"

గంధర్వరూపంలో యిప్పటిదాకా అలరించిన ఆ అందగాడు క్షణాలమీద రాక్షస రూపం ధరించినట్టుగా కనిపించేడు.

ఎన్నెన్నో అడగాలని, అతన్ని నిలేసి ఏదేదో కసి తీర్చుకోవాలని అనిపించింది. ఇంకోడి భార్యని లేపుకొచ్చి అనుభవించటానికి లేని ఆటంకాలు, పెళ్లిచేసుకోటానికి ఎదురొస్తాయి కాబోలు.

దుఃఖంతో పూడిపోతున్న గొంతుతో ఏం మాట్లాడలేకపోయాను. అంతేకాదు. నేను చేసింది పొరపాటనీ, తప్పిదం నాదేనని తెలిసిన వివేకం అతనితో ఇంకేం మాట్లాడినా వ్యర్థమేనని తెలియజేసింది...."

"మరి అతడ్ని అలాగే వదిలేసేరా?" ఆతృతగా అడిగింది రాజేశ్వరి.

"వదిలించుకు పోవాలని చూసే పగవాడిని ఆపడం అవివేకం కాదూ...."

"మీరు 'రాఘవ' అదే మీవారిదగ్గరికి వెళ్లిపోయారా?"

"వెళ్లాను. రాఘవ మొరటువాడే కావచ్చు. సరదాలు, చమత్కారాలు తెలియని బ్రభాజమానమే కావచ్చు. కాని అతడికి మంచి మనసు వుంది. నన్ను క్షమించగలడని, అర్థంచేసుకుని తన గుండెల్లో దాచుకోగలడని, అతడి పాదాలు నా కన్నీళ్లతో కడగాలని తిరిగివచ్చాను. కాని....కాని...."

"ఏమయింది? మిమ్మల్ని వెళ్లగొట్టారా?"

"అలా చేసివుండినా నా అపరాధానికి తగిన శిక్ష విధించబడిం దనుకునేదాన్ని. కాని....రాఘవ .... అంత మొరటు మనిషిలో అంత సున్నితమైన హృదయం వుంటుందని ఏమాత్రం వూహించలేకపోయాను. నేను గిరితో వెళ్లిపోయాక చుట్టుప్రక్కల, ఆఫీసులోనూ అవమానంపాలు కాలేక, బంధుమిత్రుల్లో తలెత్తుకు తిరగలేక....తను తను ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసింది."

"నిజం...." భయంగా, ఆశ్చర్యంగా అడిగింది రాజేశ్వరి.

"అక్షరాలా నిజం. నా స్వార్థానికి, నా తొందరపాటుకు రాఘవ బలిఅయ్యాడు. నాన్న దగ్గరికి వెళ్లాను. జీవచ్ఛవంలా మంచం మీదున్న ఆయన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఆవేదన చెందాను. ఆయన పాదాలమీద పడి నా తల బద్దలు కొట్టుకొని విలపించాలనుకున్నాను. కాని, కాని....నాన్న గడపదాటి లోపలికి రానివ్వలేదు. వాళ్లు చూసిన చూపుల్లోనూ మాట్లాడిన నాలుగు మాటల్లోనూ నా తప్పిదం వాళ్ల బ్రతుకుల్ని ఎంతలా కాల్చేసిందో అర్థమైపోయింది. శుభలేఖల దాకా వచ్చిన చెల్లాయి పెళ్లి ఆగిపోయింది.

'అక్క అంత బాగా చేసింది సంసారం. ఇంక ఈ చెల్లెలు కాపురం వెలగబెడుతుందా!' అన్నారు.నిజమే కదా! ఎవరిభయం వాళ్లది.పెళ్లి తప్పిపోయింది. యీ సందేహంతోనే సంబంధాలు రాలేదు. వచ్చినవి కుదరలేదు. ఆ అవమానంతో ఆత్మహత్య చేసుకుంటారేమోనని ఒకర్నొకరు కాపలా కాయటంతో యిద్దరూ ప్రాణాలతో వున్నారు.

'దయచేసి ఈ కొన ప్రాణాలకు కూడా ఎసరుపెట్టకు తల్లీ!' అని మంచంలోంచే నాన్న చేతులెత్తి నాకు దండం పెడుతూంటే....ఆ క్షణానే నా గుండెలు ఎందుకు పగిలిపోలేదా అని యిప్పటికీ నాకు బాధే. ఆ దృశ్యం తలుచుకుంటే రంపపు కోతగా వుంటుంది నాకు. వృద్ధాప్యంలో నాన్న గుండెల నిండా ఆవేదన నింపి మొగ్గలాంటి జీవితం విరబూసే తరుణంలో చెల్లెలు జీవితంలో నిప్పులు పోసి, దాని గుండెల్లో ఆరని మంటలు- రగిలించాను. నేను యింక ఏంచేస్తే మాత్రం వాళ్ల బ్రతుకులు బాగుపడతాయి?

నిప్పురవ్వ మిడిసిపడితే పది కొంపలు కాల్చేసినట్టు నా మూలంగా యిందరి జీవితాలు బలి అయ్యాయి. పెళ్లికాని



పిల్ల, అమాయకురాలు, ఆశల బంధాల్లో యౌవనపు తొందరలో తప్పుచేసి వుంటే లేదా....భర్తను పోగొట్టుకుని వాడితో పాటు సమాధి కాలేకపోయిన కోరికలకు లొంగిపోయి తప్పుచేసే వితంతువూ అయితేను....ఒక్కరికి కాకుంటే ఒకరికయినా జాలి, సానుభూతి, ఎక్కడో అక్కడ సహాయమూ లభిస్తాయి. కాని కాని....రాజేశ్వరీ! పెళ్ళయి సంసారం చేసుకునే ఆడది....వూహల్లో విహరిస్తూ శక్తికి మించిన కోరికలు కోరుకుని.... అనుభవాలకోసం ఎండమావుల వెంట పరిగెడితే....ఓడిపోయి కూలబడిపోతే... ఒక్కరు....ఒక్కరంటే ఒక్కరు కూడా సానుభూతి చూపించరు. విని అసహ్యించుకుంటారు. ఎదురుబడితే 'ఛీ' అని వుమ్ముతారు.

వూహల్లో నేను నిర్మించుకున్న సుందర హర్మ్యాలు వాస్తవ జీవితంలో పేకమేడల్లా కూలిపోయాయి. చావడానికి ధైర్యంలేక, బ్రతకాలన్న కాంక్షను చంపుకోలేక నేను యింకా బ్రతికే వున్నాను. నాలాంటి వాళ్ళందరూ ఎక్కడ చేరుతారో నేనూ అక్కడే చేరాను. అదొక పెద్ద కంపెనీ. బాగా డబ్బున్న వాళ్ళొచ్చి సుఖం కొనుక్కుంటారు. అక్కడ .... అక్కడ .... నా అందం పొగిడేవాళ్ళు కొల్లలు. నా సొగసునీ....హొయలునీ....వర్ణిస్తూ నా యౌవనాన్ని జుర్రుకుంటూ....నా కళ్ళ ముందు స్వర్గాన్ని నిలబెట్టామన్నట్టు మాట్లాడేవాళ్ళు. వాళ్ళు చూపించే రంగుల కలలను కళ్ళుండీ చూడలేని గుడ్డిదాన్ని అయ్యానని ఆ వర్ణనలకు, పొగడ్తలకు పరవశించి, పొంగిపోయే హృదయం ఎప్పుడో కాలి బూడిదయిపోయిందని నాకు మాత్రమే తెలుసు. డబ్బిచ్చే ప్రతి మగాడితో అతనిచ్చే రేటుని బట్టి కొన్ని నిమషాలో, గంటలో, రోజులో అతనికి సుఖాన్నిచ్చే యంత్రంగా మారిపోతాను. ఇప్పుడు చూడండి ఈ రైలు ప్రయాణం ఎందుకు చెప్పనా? కొన్ని వందలు పోసి వారం రోజులపాటు నన్ను కొనుక్కున్న ఓ పెద్దమనిషికి కంపెనీ ఇవ్వటానికి....యిదీ ఒక బ్రతుకే నంటారా?

యివాళ ఎందరికో నేనున్నాను.... కాని....నాకు ఎవ్వరూ లేరు....ఎవ్వరూ లేరు....కాదు....కాదు....నేనే పోగొట్టుకున్నాను .... నేనే పోగొట్టుకున్నాను. అమృత భాండాన్ని కాలదన్నుకుని రొంపిలో కూరుకుపోయిన దురదృష్టవంతురాలిని....నీచురాలిని...."

* * *

దోసిట్లో ముఖం కప్పుకుని భోరున విలపించింది మైథిలి.

శిలా ప్రతిమలా కూర్చుండిపోయింది రాజేశ్వరి.

ఆ క్షణాల్లో ఆమె గుండెల్లో ఎన్ని తుఫానులు, ఉప్పెనలు, మరెన్నో వెల్లువలు....తనను తను నిలువరించుకోలేక పెనుతుఫానుకు చిగురుటాకులా కంపించిపోయింది. అంతరంగంలో జరుగుతున్న ఆ అల్లకల్లోలం ఆమె ముఖంలో ప్రస్ఫుటమవుతోంది.

"మైథిలిగారూ! ఇటు తిరుగురైలు ఎప్పుడుందో మీకు తెలుసా?"

"రాబోతున్న స్టేషన్‌లో పక్క ప్లాట్‌ఫారంలో రెడీగా వుంటుంది."

సమాధానం వినబడిన దిక్కుకేసి

మైథిలి, రాజేశ్వరి ఆశ్చర్యంగా చూశారు. కప్పుకున్న రగ్గును తొలగిస్తూ పైనుంచి అతడు అన్నాడు. అప్పుడే నిద్రలేచిన వాడిలా వున్నాడు.

చురుగ్గా లేచి నిలబడింది రాజేశ్వరి. పైనున్న తన సూట్‌కేసును కిందికి దింపుకుంది. పమిట నిండుగా సవరించుకుంది. కాళ్లకు చెప్పులు తగిలించుకుంది.

చప్పున మైథిలి అరిచేతులను తన చేతుల్లోకి తీసుకుని కళ్లకు అద్దుకుని....

మరో పది నిముషాల్లో రాజేశ్వరి బయల్దేరడానికి సిద్ధంగా వున్న మద్రాస్-బొంబే మెయిల్‌లో లేడీస్ కంపార్ట్‌మెంటులో కూర్చుని వుంది.

* * *

"కథలు వ్రాయకూడదూ! బాగా రాణిస్తావు. అబ్బ నీ యాక్షన్ సుపర్బ్. నవలా రచయిత్రివి, సినిమా హీరోయిన్‌వి కావాల్సిన లక్షణాలున్నాయి సుమా అన్నట్టు మైథిలిగారూ...."

అప్పటిదాకా బర్తుమీద వుండినతను యిప్పుడు ఆవిడ చుట్టూ చేతులేసి, ఆమె భుజాలమీద వాలిపోయి....

"నాపేరు సరస్వతి."

"తెలుసులేవోయ్ పేద్ద .... ఆహా మైథిలిగా నీ నటన....నీ డైలాగులు...."

"ఇంతకీ ఆవిడెందుకు దిగిపోయినట్టు ?"

"తను మరో మైథిలిగా మారటం ఇష్టంలేక."


"నీ కట్టుకథతో మన హనీమూన్ రాత్రిని పాడుచేశావు."

"కాని....ఒక ఆడదాని జీవితం పాడు కాకుండా చూశానని ఒప్పుకుంటారా ?"

"ఒప్పుకుంటామండీ భార్యామణి గారూ....యింతకూ యీ మిగిలివున్న రాత్రినయినా...."

* * *

ఆరోక్షణంలో ఆగింది మెయిల్. తెలతెలవారబోతోంది.




"అదరా బాదరా ఫస్ట్‌క్లాస్ కూపేలోకి ప్రవేశించాడతను,

"ఎక్స్‌క్యూజ్ మి."

కిటికీ నానుకుని ఒకరి నొకరు హత్తుకుని కూర్చునివున్న జంట వులిక్కిపడి కళ్లు తెరిచారు.

"ఈ సీటులో వున్నావిడ...."

సరస్వతి భర్తకేసి అర్థవంతంగా చూసింది.

"ఆవిడ దిగిపోయారు మధ్యలోనే." అన్నాడతను,

"ఏమిటీ ? రాజేశ్వరి దిగిపోయిందా ? మీరు చూశారా," ఆతృతగా అడిగాడు.

"కళ్లారా! యీ పాటికి గమ్యం చేరుకునే వుంటారు."

"ఇంటికి." వ్యంగ్యంగా అన్నాడు సరస్వతి భర్త.

"ఓ మై గాడ్!" అంటూ పిడికిళితో నుదురు రుద్దుకుంటూ దిగిపోయాడు. వెడుతున్నవాడల్లా చప్పున ఆగాడు. వెనక్కి తిరిగాడు.

"జీవన్ ...."

పిలుస్తోంది....ఆవిడే .... యిందాకా ఆ కూపేలో....

కిటికీ దగ్గరికి వచ్చాడు. మెయిలు బయలుదేరుతాను అన్నట్టు మొరపెడుతోంది.

"జీవన్! నీవు కుర్రాడివి. ఈ దేశంలో ఎందరో ఆడపిల్లలు వున్నారు. అందం లేక, చదువులేకనే గాదు అవన్నీ వుండి కూడా కట్నాలు యిచ్చి పెళ్లి కొడుకులని కొనలేక ఎందరో కన్యలు కలల బరువుతో క్రుంగిపోతూ, వాటిని నిజంచేసుకునే తాహతులేక బ్రతుకులు నిస్సారంగా, బరువుగా గడిపేస్తున్నారు. వాళ్లలో ఏ ఒక్కరినయినా వుదారంగా నీవు పెళ్లాడగలిగితే ఒక జీవితాన్ని వుద్ధరించినవాడి వవుతావు. ఒక కన్య బ్రతుకును పండించినవాడి వవుతావు. ఒక కన్నెపిల్ల తల్లిదండ్రుల కన్నీళ్లు తుడిచినవాడవవుతావు. అంతేకాని పాల కుండవంటి సంసారంలో విషబిందువులా ప్రవేశించి వాళ్ల దాంపత్యం భగ్నంచేసి వాళ్లని విడదీసి....నీ తల్లిలాంటి, నీ చెల్లిలాంటి ఒక గృహిణి జీవితాన్ని నాశనంచేయడానికి చూడకు. కళ్లముందున్న స్వర్గాలని గుర్తించలేక తమకు అందని మరేదో మధురజగత్తు వుందనుకుని ఆకర్షణలకు లోబడే ఆడవాళ్లు వుంటారు. వాళ్ల బలహీనతలను ఆధారంచేసుకుని పబ్బం గడుపుకునే మగవాడు నీచాతినీచుడు. నీ కిది అలవాటో లేక తెలియకచేసే పొరపాటో నాకు తెలీదుగానీ నీవు నడుస్తున్న దారి సరైంది కాదు. నీలాంటి యువకులు సక్రమమైన మార్గంలో నడిచి....తన చుట్టూ వున్న వారిని కూడా నడిపించగలిగినప్పుడు.... ఈ సంఘం...."

బోయ్‌మని అరుస్తూ మెయిలు బయలుదేరింది.

ఈ సంఘం....యీ దేశం....ఆ కిటికీలోంచి ఆ చేయి వూగుతూనే వుంది.

ఆ మాటలు గాలిలో తేలివస్తూ వుంచే నేలకు అతుక్కుపోయినట్టు నిలబడి పోయాడు జీవన్.